ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు

శనివారం 30 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (శని)	సా.6.24
	సహరి (ఆది)	ఉ.4.37

8న అంబేడ్కర్ జీవితం కృషిపై నృత్య రూప నాటక ప్రదర్శన

వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

కాకినాడ సాగర తీరంలో అద్భుత విన్యాసాలు

- ఆకట్టుకున్న టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాలు
- పాల్గొన్న ఇండో-అమెరికా యుద్ధ నౌకలు

కాకినాడ బీచ్‌లో ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్-24 యాంఫీబీఎస్ విన్యాసాలు మూడోరోజు ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధనౌకలతోపాటు భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ జలస్వ, కేసరి, ఐరావత్ యుద్ధనౌకలు ఈ విన్యాసాల్లో వీరోచిత పోరాట ప్రదర్శన, విపత్తుల సమయంలో అందించే రిస్క్యూ ఆపరేషన్లు వంటివి ప్రదర్శించి అబ్బురపరిచాయి.



కాకినాడ బీచ్‌లో సముద్రతీరంలో యుద్ధ నౌక, హెలికాప్టర్ల ద్వారా సైనికుల విన్యాసాలు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల

చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



గొల్లప్రోలులో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువ మోస్తున్న క్రీస్తు వేషధారి, ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు



ఇష్టానుసారం.. తవ్వకాలు

జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామ చెరువులో మట్టి తవ్వి తరలిస్తున్న దృశ్యం

- జగ్గంపేటలో చెరువులపై కన్నేసిన అక్రమార్కులు
- ఇప్పటికే పుష్కర, పోలవరం గట్లు మాయం..
- ఎన్నికల పనుల్లో అధికారులు
- ఇదే అదునుగా చెరువులు తవ్వేస్తున్న వైనం

జగ్గంపేట, మార్చి 29: పుష్కరకాలువలు తవ్వేశారు. పోలవరం గట్లు మాయం చేసేశారు. ఇప్పుడు చెరువుల తవ్వకం మొదలెట్టేశారు. ప్రస్తుతం అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నం కావడంతో మట్టి అక్రమార్కులకు సరైన సమయం వచ్చినట్లయింది. రాత్రుల్లే అనుకుంటే పట్టపగలు సైతం ఎటువంటి బెరుకు లేకుండా యధేచ్ఛగా మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. అందులోని వేసవి మొదలుకావడంతో ఎక్కడికక్కడ చెరువులు ఎండిపోవడంతో అక్రమార్కులకు వరంగా మారినట్లయింది. ఎక్కడ చెరువు ఎండిపోతే అక్కడ వాలిపోయి స్థానిక నాయకుల అండదండలతో మట్టిని తవ్వేసి తరలించేస్తున్నారు. అనధికారికంగా జేసీబీతో మట్టిని తవ్వించి ట్రాక్టర్లు, లారీలపై చుట్టుపక్కల ప్రాంతాలకు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. జగ్గంపేట మండలంలో గోవిందపురం గ్రామంలో అక్రమంగా మట్టితవ్వుతుండడం ఆంధ్రజ్యోతి కంట పడింది. అంతేకాకుండా నరేంద్రపట్నం, బావారం, కాండ్రేగుల, ఇర్రిపాక తదితర గ్రామాల్లోని చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు భారీగా జరుగుతున్నాయని స్థానికులు చెపుతున్నారు. మట్టి మాఫియా వాళ్లు స్థానిక నాయకులు, అధికారులకు కొంత మొత్తం సొమ్ములు ఇచ్చి మట్టి దోచుకుంటున్నారని సమాచారం. కేవలం రాజకీయ నాయకుల అండదండలతో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని దీనిపై ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెట్టలో ఆగని గ్రావెల్ తవ్వకాలు

- గండేపల్లి మండలంలోని సూరంపాలెం రహదారి పక్కన తవ్వకాలు
- నిమ్మకు నీరెత్తినట్లు అధికారుల శైలి
- నాయకుల అండదండలతో లారీల్లో తరలింపు
- ఎన్నికల కోడ్ ఉన్నా పట్టించుకోని అధికారులు

గండేపల్లి, మార్చి 29: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ మెట్టలో గ్రావెల్ తవ్వకాలు రాత్రి, పగలు తేడా లేకుండా జోరుగా సాగుతున్నాయి. గండేపల్లి మండలంలోని యర్రంపాలెం పంచాయతీ పరిధిలో సూరంపాలెం రహదారి పక్కన ఉన్న కంకరచెరువు సమీపంలో మెట్టపై కొంతకాలంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అడ్డూఅదుపూ లేకుండా భారీ లారీలపై మట్టిని తరలిస్తున్నా అధికారుల శైలి నిమ్మకు నీరెత్తినట్లుందని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా అధికారులు పట్టించుకోకుండా మామూళ్లకు అలవాటుపడ్డారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వేసి లక్షల్లో సొమ్ములు చేసుకుంటున్నారు. స్థానిక అధికార నాయకులు అండదండలతోనే మట్టి మాఫియా ఇష్టమొచ్చినట్లు చెలరేగిపోతోందని విమర్శిస్తున్నారు. ఎక్స్‌కేటర్లతో లోతుగా మట్టిని తవ్వుతున్నారు. దీంతో రాబోయే రోజుల్లో ఆ కొండ ప్రాంతమంతా గోతులమయంగా మారే పరిస్థితి నెలకొంది. రోజూ వందల లారీల్లో గ్రావెల్ ఇతర జిల్లాలకు తరలిపోతున్నా అధికారులు పట్టనట్లు ఉన్నారు.



యర్రంపాలెం పంచాయతీ పరిధిలో గ్రావెల్ తవ్వకాలు

జనసేనాని శ్రీకారం

- జనసేన అధినేత పవన్ రాక నేడే
- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారానికి ఏర్పాట్లు
- నాలుగురోజులపాటు నియోజకవర్గంలో ఉండడనున్న పవన్
- నేడు మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలుకు హెలీకాప్టర్‌లో రాక
- పాదగయలో వారాహి వాహనానికి పూజలు
- అనంతరం దత్తపీఠం సందర్శన: అక్కడినుంచి వర్మ ఇంటికి పయనం
- సాయంత్రం చేబ్రోలులో బహిరంగ సభలో ప్రసంగించనున్న పవన్



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/పిఠాపురం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా గడ్డ నుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. అధికార వైసీపీ ఓటమే లక్ష్యంగా తన ఎన్నికల వ్యూహాన్ని ఉమ్మడి జిల్లానుంచే మొదలుపెట్టనున్నారు. తాను పోటీచేస్తున్న పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం వేదికగా అసలు సిసలు ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. అమ్మవారి ఆశీస్సులతో వారాహి వాహనమెక్కి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి జనాశీర్వాదం అందించాలని పిలుపునివ్వనున్నారు. ప్రజావ్యతిరేక జగన్ ప్రభుత్వానికి చెల్లు చీటి పడేలా చేయాలని ప్రజలకు పిలుపునివ్వనున్నారు. వాస్తవానికి త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ పిఠాపురం గడ్డనుంచే ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు ఇప్పటికే పవన్ స్వయంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో పిఠాపురంనుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని పవన్ శనివారంనుంచి ప్రారంభించబోతున్నారు. దీంతో పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంచుకోవడానికిగల కారణాలు, తనను గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు ఎలా మారుస్తాననే దానిపై పవన్ తన ఎన్నికల ప్రచార పర్యటనలో ప్రజలకు వివరించనున్నారు. తనను ఓడించడానికి పిఠాపురంలో అధికార వైసీపీ పన్నుతున్న కుయుక్తులను సైతం తన పర్యటనలో ప్రస్తావించనున్నారు. ఈ నేపథ్యంలో పవన్ పిఠాపురంలో తొలి ఎన్నికల ప్రచార పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి పిఠాపురంలో పవన్ పర్యటనపైనే నెలకొంది. శనివారంనుంచి పవన్ మొత్తం నాలుగు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

నేటి పర్యటన ఇలా..

తొలిరోజు శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని హెలీప్యాడ్‌లో పవన్ దిగనున్నారు. అక్కడినుంచి నేరుగా పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి చేరుకుని పురుహూతికా అమ్మవారికి పూజలు చేస్తారు. అక్కడే వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం దత్త పీఠాన్ని సందర్శిస్తారు. అక్కడినుంచి దొంతమూరులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి వర్మ నివాసానికి వెళ్లి ఆయన్ను పలకరిస్తారు. అక్కడినుంచి కుమారపురంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసకు వెళ్తారు. తిరిగి చేబ్రోలులోని రామాలయం సెంటర్‌లో సాయంత్రం 4.30గంటల నుంచి 6.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తిరిగి బసకు వెళ్తారు. కాగా ఆదివారం నాటి షెడ్యూల్‌పై శనివారం రాత్రికి స్పష్టత రానుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసికట్టుగా ఎన్నికలకు వెళ్తున్న నేపథ్యంలో బహిరంగ సభల్లో పవన్ తోపాటు వారాహి వాహనంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మతోపాటు బీజేపీ నేతలు కూడా ఎక్కనున్నారు. పవన్ పిఠాపురంనుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ఎన్నికల్లో సహకరించేందుకు అనేక జిల్లాలనుంచి నేతలు పిఠాపురానికి చేరుకున్నారు. ఎన్నికలయ్యే వరకు వారంతా ఇక్కడే ఉండి పనిచేయనున్నారు. హైదరాబాద్‌నుంచి పలువురు స్కేటర్స్ తరలివచ్చారు. వీరంతా సింగిల్ వీల్ వాహనంపై తిరుగుతూ నియోజకవర్గంలో ప్రచారం చేయనున్నారు. తెలంగాణ, బెంగళూరు, పూణే నుంచి పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పవన్ ప్రచారంలో పాల్గొననున్నారు. కాగా నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యటనలో పవన్ వివిధ వర్గాలతో సమావేశం కానున్నారు. ఉప్పాడ మత్స్యకారులు, చేనేతలు, మేధావులు, వ్యాపారులు తదితరులతో సమావేశమై పిఠాపురం నియోజకవర్గానికి భవిష్యత్తులో ఏమేం చేయాలి? ఎలాంటి సమస్యలున్నాయి? వంటి అంశాలపై చర్చించి ప్రత్యేక అజెండా కూడా ప్రకటించే అవకాశం ఉంది. మరోపక్క ఈనెల 2న తర్వాత పవన్ ఇతర జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నారు.

మలి విడతలో..

కాకినాడ రూరల్ నియోజకవర్గానికి ఏప్రిల్ 8న రానునారు. ఆరోజు సాయంత్రం బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం ఏప్రిల్ 9న పిఠాపురంలో ఉగాది వేడుకల్లో ఎల్గొననున్నారు. ఆ తర్వాత 10న కోనసీమ జిల్లా రాజోలు, 11న పి.గన్నవరం, 12న తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. దీనికి వారాహి విజయభేరి బహిరంగ సభగా నామకరణం చేశారు. మరోపక్క పవన్ పిఠాపురంలో పోటీచేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే అధికార వైసీపీ భారీగా మోహరించింది. కోట్లలో నగదు పంపిణీ, వివిధ వర్గాలను, వారి ఓట్లను కొనుగోలు చేయడానికి పెద్దఎత్తున అడ్డదారి వ్యూహాలు అమలుచేస్తోంది. నియోజకవర్గంలో మండలాలను మూడు ముక్కలు చేసి ముగ్గురు కీలక నేతలకు అప్పగించి వారి ద్వారా చెరో రూ.50కోట్లు చొప్పున ఖర్చుచేయిస్తోంది. డబ్బుల పంపకం, దొంగ ఓట్లు వేయడానికి వీలుగా ఏకంగా కడప నుంచి బృందాలను తరలిస్తోంది. వీరికోసం నియోజకవర్గంలో అద్దె ఇళ్లు కూడా తీసింది. ఈ కుయుక్తులను పసిగట్టిన జనసేనాధిపతి వైసీపీ అడ్డగోలు వ్యూహాలపై ధ్వజమెత్తారు. తనను ఓడించడానికి వైసీపీ పిఠాపురంలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి సిద్ధంగా ఉందని నిప్పులు కక్కారు. ఈ నేపథ్యంలో పవన్ ఎన్నికల ప్రచారం, వైసీపీ ఎన్నికల వ్యూహాలతో పిఠాపురం రాజకీయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తాం

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద పటిష్ట బందోబస్తు
- నియమావళి ఉల్లంఘనపై కఠిన చర్యలు
- కాకినాడ జిల్లా కలెక్టర్ జే.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 29: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ జే.నివాస్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన జిల్లా కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. ఎక్కడైతే క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉంటాయో వాటిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు జరిగేలా అన్నిచర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోటీలో ఉన్న అభ్యర్థులకు ప్రచార అనుమతులు, నామినేషన్ ప్రక్రియ, ఇతర అనుమతులు ఇస్తామన్నారు. జిల్లాలో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేస్తామన్నారు.

ఎన్నికల విధులకు దూరంగా వలంటీర్లు

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ఆదేశాలను ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రవర్తన నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరిస్తారో వారిపై నిబంధనలకు అనుగుణంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

చెక్‌పోస్టులపై ప్రత్యేక నిఘా

జిల్లాలో ఉన్న 8 చెక్‌పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచామని కలెక్టర్ నివాస్ వెల్లడించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ టీవీ ద్వారా నిరంతరం మద్యం, నగదు తరలింపుపై దృష్టి కేంద్రీకరించామన్నారు. జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అభ్యర్థులు పంపిణీ చేసే తాయిలాలపై దృష్టి పెట్టామని చెప్పారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదులను అనుసరించి ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేస్తారన్నారు. జిల్లాలోని యువ ఓటర్లు ఓటు వేయడానికి ఎక్కువగా ఉత్సాహం చూపిస్తారని, వారికి ఓటుపై ఎక్కువగా అవగాహన కల్పిస్తామని చెప్పారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జే.నివాస్

సాగునీటి సమస్యపై చర్చిస్తాం

జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారానికి ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తామని కలెక్టర్ తెలిపారు. తాళ్లరేవు మండలంలో పి.మల్లవరం, పిఠాపురం మండలంలో ఏలేరు ఆయకట్టులో సాగునీటి ఇబ్బందులపై సమీక్షించి పరిష్కారం దిశగా చర్యలు చేపడతామన్నారు.

నూతన కలెక్టర్‌కు స్వాగతం

తొలుత జిల్లా కలెక్టర్ నివాస్‌కు జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు, ఆర్డీవో కిషోర్, తహసీల్దార్ చెల్లన్న దొర, డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం, సమాచారశాఖ డీడీ నాగార్జున, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కుడా వీసీ కృష్ణమూర్తి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసు తదితరులు పుష్పగుచ్ఛాములు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

అత్యధిక శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలి: కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 29: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఓటర్లు అత్యధికశాతం ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ జె.నివాస్ ఆర్వోలను ఆదేశించారు. కాకినాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. అనంతరం ఓటర్ల జాబితా, జెండర్ రేషియో, పోలింగ్ కేంద్రాలు, సెక్టార్లు, రూట్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, స్టోరేజ్ పాయింట్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్లు, ఈవీఎం, వీవీప్యాట్స్ వంటి వివరాలపై సమీక్షించారు. కార్యక్రమంలో పిఠాపురం ఆర్వో, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, తుని ఆర్వో రామలక్ష్మి, ప్రత్తిపాడు ఆర్వో శ్రీనివాసరావు, కాకినాడ రూరల్ ఆర్వో కిషోర్, పెద్దాపురం ఆర్వో సీతారామారావు, కాకినాడ సిటీ ఆర్వో వెంకటరావు, జగ్గంపేట ఆర్వో ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా ప్రసూతి సెలవుపై వెళ్తున్న కలెక్టర్ కృతికాశుక్లా కలెక్టరేట్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎస్పీ సతీష్‌కుమార్, అటవీశాఖ అధికారి కె.భరణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ నివాస్

ఉద్యోగుల బకాయిల చెల్లింపు మాటలు నీటి మూటలేనా?

- కాకినాడ జిల్లా ఎస్టీయూ

కాకినాడ రూరల్, మార్చి 29: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఆర్సీ, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, సీపీఎస్ తదితర బకాయిలు రూ.21,000కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో చాలాబకాయిలను మార్చి చివరిలోగా చెల్లిస్తామని ప్రధాన కార్యదర్శి, మంత్రుల కమిటీ హామీ ఇచ్చినా ఇప్పటివరకూ అరకొర చెల్లింపులు మాత్రమే చేశారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ తెలిపారు. ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ అధ్యక్షతన కాకినాడ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో తమకు ఇచ్చిన హామీల మేరకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంఈవో 1,2లకు సమాన అధికారాలు ఇవ్వాలని, సీనియర్ ఎంఈవోకు డీడీవో అధికారం ఇవ్వాలని కోరారు. అనంతరం సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలన్నింటికీ హెచ్‌ఎం, ఎస్ఏ(పీఈ) పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఇతర సంఘాల నుంచి కొంతమంది నాయకులు ఎస్టీయూలో చేరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమంచి కాశీ విశ్వనాథ్, ఆర్థిక కార్యదర్శి శేశెట్టి సత్యనారాయణ, నాయకులు సత్యనారాయణరాజు, శ్రీను, సుబ్బరాజు, వెంకటేశ్వరరావు, సంపత్‌కుమార్, రామకృష్ణ, శేఖర్, రాజు, రాఘవ, శ్రీనివాసరావు, సతార్, అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్



ఏప్రిల్ 5 నుంచి వాడపల్లి వెంకన్న అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి29: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి అధ్యయనోత్సవాలను ఏప్రిల్ 5 నుంచి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ద్రవిడ వేదపారాయణ, సేవాకాలం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయన్నారు. ఐదు రోజులూ అష్టోత్తర పూజలు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రెండు పర్యాయాలు జరుగుతాయన్నారు. 9న ఉగాది పర్వదినం రోజున అష్టోత్తర పూజలు రద్దు చేశామని, అలాగే ఐదు రోజులూ నిత్య కల్యాణాలు జరగవని చెప్పారు. ఏప్రిల్ 18 నుంచి 14వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరుపుతామన్నారు. లక్షలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 6, 20వ తేదీల్లో స్వామివారి సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్టు ఈవో చెప్పారు.


సముద్రంలో విన్యాసాల్లో పాల్గొన్న ఐఎన్ఎస్ ఐరావత్ యుద్ధ నౌక


బీచ్‌లో దాడుల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది


అమెరికాకు చెందిన సమగ్ర ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎయిర్ కుషన్


విమానం నుంచి రోప్‌తో కిందకు దిగుతున్న సైనికులు

కాకినాడ సాగరంలో అద్భుత విన్యాసాలు

ఆకట్టుకున్న టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాలు

పాల్గొన్న ఇండో-అమెరికా యుద్ధ నౌకలు


బీచ్‌లో యుద్ధ ట్యాంకర్‌తో మోహరించిన దృశ్యం


ఇండియా-అమెరికా సైనికాధికారులు అఖిలేష్ కుమార్, జన్నీఫర్ లార్సన్


బీచ్‌లో దాడుల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది

సర్పవరం జంక్షన్, మార్చి29: ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్-24 యాంపిబీఎస్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధ నౌకలతోపాటు ఇండియా తురుపుముక్కలు ఐఎన్ఎస్ జలస్వ, కేసరి, ఐరావత్ యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో శత్రుదేశాలపై చేసే వీరోచిత పోరాట ప్రదర్శన, విపత్తులు, ఆపద సమయంలో మానవతా సహాయం అందించే రిస్క్యూ సమయంలో అందించే సేవలు ప్రదర్శించారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఎక్స్ టైగర్ ట్రయంఫ్-24 సీ ఫేజ్‌లో భాగంగా భారత్-అమెరికా యాంపిబీఎస్ విన్యాసాల్లో భాగంగా గత మూడు రోజులుగా ఇండియా నుంచి 700 మంది, అమెరికా నుంచి 400 మంది సభ్యులు విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో నిర్వహించే విధులను పోరాట పటిమను ప్రదర్శించారు. భారత్ భూభాగంలోకి ఉగ్రవాదుల చొరబాట్లు, భూభాగం ఆక్రమణకు ప్రయత్నిస్తున్న శత్రుదేశంపై త్రివిధ దళాలు దాడులు చేసి, శత్రువు శిబిరాలపై ఆకాశ, జల, భూభాగంపై నుంచి మెరుపు దాడులతో ఆటకట్టించింది. భారతదేశ తూర్పునావికా దళానికి చెందిన ఐఎన్ఎస్ ఐరావత్, కేసరి, ఐఎన్ఎస్ జలస్వ ఈ మూడు యుద్ధ నౌకలు సహా అమెరికాకు చెందిన సోమర్‌సెట్ యుద్ధ నౌకతోపాటు త్రివిధ దళాలు శత్రుదేశ దురాక్రమణ, ఉగ్రవాదుల చొరబాట్లను అడ్డుకుని సమర్థవంతంగా తిప్పికొట్టారు. అలాగే తుపాన్లు, విపత్తుల సమయంలో అందించే సేవలను ఈ విన్యాసాల్లో సిబ్బంది ప్రదర్శించారు. ఐఎన్ఎస్ జలస్వ, ఐరావత్, కేసరి యుద్ధనౌకల్లో నుంచి సిబ్బంది, హెలికాప్టర్లు, మెకనైజ్డ్ లాంగ్‌ల్యాండింగ్ క్రాఫ్టలు, ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, ల్యాండింగ్ షిప్ ట్యాంకులు, శాన్స్ ఎయిర్‌క్రాఫ్ట్, మెకనైజ్డ్ ఫోర్సెస్‌తో భారీ వెసల్స్, జెమినీ బోట్లు, జెట్‌లు, యుద్ధ ట్యాంకర్లు, బంకర్లలలో ఆర్మీ సిబ్బంది వెపన్లతో జల, భూఉపరితలం, ఆకాశమార్గాల ద్వారా నిర్వహించిన విన్యాసాలు వారెవ్వా అనిపించాయి. అలాగే అమెరికా నుంచి సమగ్ర ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎయిర్ కుషన్‌లు, హెలికాప్టర్లతో కూడిన ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, డిస్ట్రాయర్, లాంగ్ రేంజ్ మేరిటైమ్ రికనైసెన్ ఎయిర్ క్రాఫ్ట్ ల్యాప్‌షిప్ మెడియేట్ పాల్గొన్నాయి.

ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

సైనిక విన్యాసాల ద్వారా ఇండియా-అమెరికా దేశాల మధ్య బలమైన, వ్యూహాత్మకమైన భాగస్వామ్యం ఏర్పడుతుందని ఆర్ఏడీఎం మార్టినెజ్ మేజర్ జనరల్ (54వ డివిజన్) అఖిలేష్‌కుమార్, నేవీ కమాండెంట్ రాజేష్ ధన్‌కర్, అమెరికా కాన్సిల్ జనరల్ జన్నీఫర్ లార్సన్‌లు అన్నారు. టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాల్లో ముఖ్య అతిథిగా హాజరైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇరు దేశాల త్రివిధ దళాల సామర్థ్యాల పెంపు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళికలు నిర్వహించేందుకు ఈ విన్యాసాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉభయచర, మానవతా సహాయం, విపత్తు ఉపశమనం తదితర అంశాలపై నిర్వహించిన విన్యాసాలతో నైపుణ్యాలు మరింత పెరుగుతాయన్నారు. ఈ విన్యాసాలు ఈనెల 18 నుంచి 24 వరకు వైజాగ్ హార్బర్ బేస్డ్ విన్యాసాలు, 26 నుంచి 29వ వరకు సముద్రం (సీబేస్డ్) యాక్టవిటీస్ చేపట్టడం జరిగిందన్నారు. కాకినాడలో సైనిక విన్యాసాలకు అన్ని విధాలా అనువైన ప్రాంతమని చెప్పారు.



వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

సామర్లకోట, మార్చి29: వేసవి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే యంత్రాంగం నిర్ణయించింది. అందులో భాగంగా కాకినాడ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును ఏప్రిల్ 1 నుంచి జూన్ వరకూ పొడిగించారు. దీంతో సామర్లకోట మీదుగా కాకినాడ నుంచి లింగంపల్లి మధ్య ఈ ప్రాంత ప్రయాణికులకు రవాణా కష్టాలు తీరనున్నాయి. ఈ మేరకు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు సికింద్రాబాద్ రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

07445 నంబరు గల కాకినాడ టౌన్- లింగంపల్లిల మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతీ సోమ, బుధ, శుక్రవారాలలో ఏప్రిల్ 1 నుంచి జూన్ 28 వరకూ పొడిగించారు.

07446 నంబరు గల లింగంపల్లిల మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతీ మంగళ, గురు, శనివారాలలో ఏప్రిల్ 2 నుంచి జూన్ 29 వరకూ పొడిగించారు.

ఈ రైళ్లల్లో ప్రయాణించే ప్రయాణికులు రిజర్వేషన్ సదుపాయాలకు సమీపంలో ఉన్న రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద సిబ్బందిని సంప్రదించాలని రైల్వే పీఆర్వో అధికారి ఆ ఆదేశాల్లో తెలిపారు.


గొల్లప్రోలు పట్టణ శివారులో పవన్‌కల్యాణ్ దిగనున్న హెలిప్యాడ్

పవన్‌కల్యాణ్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మార్చి29: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలకు ఇక్కడ నుంచే శ్రీకారం చుట్టడంతోపాటు పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన తర్వాత తొలిసారి వస్తుండడంతో భారీగా స్వాగతం పలికేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. గొల్లప్రోలులోని హెలిప్యాడ్ వద్ద పవన్ హెలికాప్టర్ దిగనున్న నేపథ్యంలో అక్కడ బారికేడింగ్ చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు చేబ్రోలు రామాలయం సెంటర్‌లో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగిస్తారు. ఇక్కడ జరిగే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై జనసేన నాయకులు, అధికారులు పరిశీలన జరిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో పవన్‌కల్యాణ్ నాలుగు రోజులు బస చేస్తారని భావిస్తున్నారు. కాగా జనసేన తరఫున ప్రచారం చేసేందుకు వచ్చిన స్కేటర్లు పట్టణంలో సందడి చేశారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

అపరిచిత మహిళలతో తస్మాత్ జాగ్రత్త!

- బట్టల షాపుల్లో మహిళల ముఠా చోరీలు
- అనుమానంతో 8 మందిని పోలీసులకు అప్పగించిన ముంగండ గ్రామస్తులు
- ముంగండలో మూడు నెలలు కిందట చోరీ
- అనుమానితులపై పాత దొంగతనం కేసులు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు

పి.గన్నవరం, మార్చి29: ఆరుగురు నుంచి పదిమంది మహిళలు ఒక బృందంగా ఏర్పడి ప్రత్యేక వాహనంలో చేరుకొని గ్రామాల్లోని బట్టలషాపుల్లో బేరసారాలతో వ్యాపారస్తుల కన్నుకప్పి ఖరీదైన చీరలు దోచేస్తున్నారు. మండలంలోని ముంగండలో గత మూడు నెలల కిందట ఈ తరహా చోరీ జరిగింది. తాజాగా ఆరుగురు మహిళలు శుక్రవారం ముంగండ వివిధ ప్రాంతాల్లోని స్థానిక బట్టలషాపులో హల్‌చల్ చేయడంతో అనుమానంతో స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం జనవరి 6న ముంగండలో నరేంద్రపురం రోడ్డులోని బండారు బొటెక్ అండ్ బ్యాగ్స్ షాపులో ఎనిమిది మంది మహిళలు ఒకేసారి చొరబడి షాపు యజమాని కన్నుకప్పి రూ.20 వేల విలువైన బట్టలు దోచుకుపోయారు. 15 నిమిషాల తర్వాత విషయాన్ని గ్రహించిన షాపు యజమాని వారి ఆచూకీ కోసం గాలించినా దొరకలేదు. మళ్లీ శుక్రవారం ఆరుగురు మహిళలు స్థానిక కళాశాల వద్ద ఉన్న శ్రీనివాస టెక్స్‌టైల్స్‌లోకి ప్రవేశించి వ్యాపారి బొడ్డు నాగేశ్వరావును మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలో అప్పటికే వీరి ప్రవర్తనను గమనించిన స్థానికులు, ఆటోయూనియన్ సభ్యులు బట్టలు షాపు వద్దకు చేరుకున్నారు. విషయాన్ని గ్రహించిన మహిళలు అక్కడ నుంచి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అలాగే మహిళలు కూడా ఉన్న ఇద్దరు మగవారు అక్కడ నుంచి జారుకోగా మొత్తం ఎనిమిది మందిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే వారి వద్ద మందు బిళ్లలు, గోనె సంచులు, రోల్డ్ గోల్డ్ నగలు ఉన్నట్టు స్థానికులు చెప్తున్నారు. ఎస్ఐ బి.శివకృష్ణ మాట్లాడుతూ ముంగండలో పట్టుపడ్డ వారంతా విజయవాడ సమీపంలోని జి.కొండూరు మండలమని తెలిపారు. వీరిపై వివిధ చోట్ల పాత చిల్లర దొంగతనం కేసులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టంచేశారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

8న అంబేడ్కర్ జీవితం కృషిపై నృత్య రూప నాటక ప్రదర్శన

కాకినాడ సిటీ, మార్చి 29: బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితం కృషిని వివరిస్తూ హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి' నృత్య రూప నాటక ప్రదర్శనను ఏప్రిల్ 8వ తేదీ సాయంత్రం కాకినాడ సూర్య కళామందిరంలో ఏర్పాటు చేసినట్టు వివిధ ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంద్రపాలెం వంతెన అంబేడ్కర్ విగ్రహం వద్ద నాటక ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే పేరెన్నికగన్న నాయకుడని అన్నారు. ఆయన బాల్యంలో, యుక్త వయసులో పడిన కష్టాలు, దేశం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన కృషి, తపన ఈ నాటకంలో చూడవచ్చన్నారు. అంబేడ్కర్ కొందరివాడు కాదని, అందరివాడని ఈ నాటకం చూస్తే అర్థమవుతుందన్నారు. సీఐటీయూ, యూటీఎఫ్, జేవీవీ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ వంటి ప్రజా సంఘాలన్నీ సంయుక్తంగా ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశాయన్నారు. నగర ప్రజలు అంబేడ్కర్ నాటక ప్రదర్శను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు, కోశాధికారి మలక వెంకటరమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, రూరల్ కన్వీనర్ టి.రాజా, ఐద్వా నగర కార్యదర్శి కె.నాగజ్యోతి పాల్గొన్నారు.


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో ఎస్‌హెచ్‌వో

కల్యాణ మండపంలో చోరీకి పాల్పడ్డ నిందితుడు అరెస్టు

148 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

సర్పవరం జంక్షన్, మార్చి29: ఈనెల 17వ తేదీన ఆర్టీవో ఆఫీసు రోడ్డులోని కమ్మ కల్యాణ మండపంలో జరిగిన వివాహ ఫంక్షన్‌లో చోరీకి గురైన 148 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వివాహం జరుగుతున్న సమయంలో పిఠాపురం పట్టణానికి చెందిన కె.వీరశంకర్ అతిథిలా వచ్చి అక్కడే సోఫాపై ఉన్న కాకినాడకు చెందిన గుణ్ణం సత్యనారాయణ కుటుంబసభ్యులకు చెందిన హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి లాకెట్ కలిగిన 148 గ్రాముల మూడు బంగారు చైన్లను తీసుకుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో హనుమంతరావు నేతృత్వంలో నిందితుడు కోసం గాలిస్తుండగా గురువారం ఆర్టీవో ఆఫీసు వద్ద వీరశంకర్‌ని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నిందితుడి నుంచి చోరీకి పాల్పడ్డ సుమారు రూ.2.40 లక్షల విలువైన 148 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడి పట్టివేతలో కీలకంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ జి బలరామమూర్తి, హెచ్‌సీలు గణేష్‌బాబు, పి.సత్యనారాయణరాజు, కె. వెంకటరత్నంలను ఎస్పీ సతీష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.

తప్పుడు రిపోర్టు పంపారంటూ ఎస్ఐపై ఫిర్యాదు

రంగంపేట, మార్చి 29: తప్పుడు రిపోర్టు పంపిన రంగంపేట ఎస్ఐపై జిల్లా కలెక్టర్‌కి, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు రంగంపేట గ్రామానికి చెందిన యన్నన సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత నెల 4వ తేదీన తమ అన్నదమ్ముల ఆస్తి వివాదంపై స్పందనలో అమరావతికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి నివేదిక పంపాలని అక్కడ నుంచి స్థానిక పోలీసులను ఆదేశించారన్నారు. దీంతో గత నెల 18న ఎస్ఐ విజయ్‌కుమార్ విచారణ జరిపి తప్పుడు నివేదికను స్పందన వారికి సమర్పించారన్నారు. విచారణ సమయంలో తాము ఆ స్థలానికి సంబంధించిన దస్తావేజులు, ఇంటి పన్ను రశీదులు ఇచ్చినప్పటికీ తీసుకోకుండా- విచారణ రిపోర్టులో పత్రాలు లేవని, కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తప్పుడు రిపోర్టు పంపారన్నారు. ఈ విచారణలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహశీల్దార్ లతీఫ్ పాషా, మండల కమిటీ కూడా సహకరించారన్నారు. తనకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని యన్నన సుబ్బారావు తెలిపారు. దీనిపై ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ స్థలం వివాదం గురించి తానేమి రిపోర్టు పంపించలేదన్నారు. ఇది సివిల్ మేటర్ కనుక సివిల్ కోర్టులో తేల్చుకోవాలని సుబ్బారావుకు చెప్పానని, ఈ స్థలం గురించి రెవెన్యూ అధికారులకు తెలుస్తుంది కనుక తహశీల్దార్ కార్యాలయానికి పంపించానని చెప్పారు.


కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీఈవో ముకేష్‌కుమార్ మీనా, జిల్లా ఉన్నతాధికారులు

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా

నన్నయ వర్శిటీలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

దివాన్‌చెరువు, మార్చి 29: ఈవీఎం, ఇతర అనుబంధ యూనిట్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతతోపాటు ఇతర రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముకేష్‌కుమార్ మీనా వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా దివాన్ చెరువు పరిధిలోని నన్నయ యూనివర్శిటీ ఆవరణలో ఏర్పాటుచేసిన వివిధ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలు, రూట్ మ్యాప్‌పై సమగ్ర సమాచారాన్ని జిల్లా కలెక్టర్ మాధవీలత సీఈవోకు వివరించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఈవీఎమ్‌లు, ఇతర అనుబంధ యూనిట్స్ నన్నయ వర్సిటీకి తీసుకొస్తామన్నారు. రిసెప్షన్ కేంద్రం వద్ద ఈవీఎమ్‌లను స్వీకరించిన అనంతరం నిర్ధిష్టమైన రూట్‌లో ఆయా నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌కి తరలించనున్నట్టు కలెక్టర్ వివరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్స్, రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొని వచ్చే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ ఇస్తామని కూడా ఆమె తెలియజేశారు. తదనంతరం సీఈవో ముకేష్‌కుమార్ మీనా చేసిన సూచనల మేరకు పలు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చెప్పారు. పోలీస్ పరంగా అన్ని భద్రతా చర్యలు తీసుకోవడంతోపాటు, జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకుంటామని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో వెంట రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో ఎన్.తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్వో అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, రాజానగరం ఆర్వో చైత్రవర్షిణి, నిడదవోలు, గోపాలపురం ఆర్వోలు రమణానాయక్, శివజ్యోతి, తదితరులున్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న కేవీకే హెడ్ నాయుడు, ఆత్మ పీడీ జ్యోతిర్మయి

పాడి పశువుల్లో వ్యాధులపై అవగాహన అవసరం

పశువుల్లో ప్రథమ చికిత్సపై కేవీకేలో ముగిసిన శిక్షణ

రాజానగరం, మార్చి 29: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాడి పశువుల్లో సంక్రమించే వ్యాధులపై అవగాహన ఉండాలని కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. పశువుల్లో ప్రథమ చికిత్స, యాజమాన్యంపై గ్రామీణ యువతకు కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో వారంరోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ శుక్రవారం ముగిసింది. ఆత్మ తూర్పుగోదావరి జిల్లా సౌజన్యంతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాడిపశువుల పోషణ, యాజమాన్యం, టీకాలు, పశుగ్రాసం రకాలు, సాగు, పాల దిగుబడికి పాటించాల్సిన అంశాలు, పశువుల్లో సంక్రమించే వ్యాధులు, నివారణ, ముఖ్యంగా పొదుగువ్యాధి (మాస్టయిటీస్) గుర్తింపు, చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ, ప్రదర్శన నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన ఔత్సాహిక గ్రామీణ యువతీయువకులకు కేవీకే రిటైర్డ్ వైద్యులు డాక్టర్ పీవీవీఎస్ శివరావు, డాక్టర్ బి.జాన్‌బాబు పశువుల్లో ప్రథమ చికిత్స, పోషణ యాజమాన్యంపై శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమం నిర్వహణకు ప్రోత్సహించిన ఐకార్-సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్లో ఎలక్ట్రిక్ వాహనాలు

మరి కొద్దిరోజుల్లో అందుబాటులోకి..

రాజమహేంద్రవరం, మార్చి29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో మరో కొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్లాట్‌ఫాంపై పరుగులు పెట్టనున్నాయి. బయటి నుంచి రైల్వే ప్లాట్‌ఫాంపైకి, అక్కడ నుంచి బయటకు ప్రయాణికులను తరలించడానికి ఈ సదుపాయాన్ని తీసుకొస్తున్నారు. రైలు బోగీ వద్దకు ఈ వాహనాలు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని బయట ప్రాంగణంలో దింపుతాయి. అందుకు ఒక్కొక్కరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారు. రెండు ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చే నెల 29వ తేదీలోపు రాజమండ్రి రైల్వే స్టేషనులో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు టెండర్లు ఖరారయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాల వల్ల వృద్ధులు, రోగులకు బాగా ఉపయుక్తంగా ఉంటుంది. ఎన్ఎస్‌జీ-2 హోదా దక్కించుకొన్న రాజమండ్రి రైల్వే స్టేషనల్లో మరిన్ని మెరుగైన సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖలో ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహనాలు విజయవంతమయ్యాయి.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 29: రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని మసీదుల్లో శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మెయిన్‌రోడ్‌లోని జామియా మసీదు, జె.రామారావుపేట, జగన్నాథపురం, రేచెర్లపేట, రెవెన్యూ కాలనీ మసీదుల్లో ప్రార్థనల్లో పెద్దసం ఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. రామకృష్ణారావుపేట, కొత్తూరు మసీదుల్లో ఇఫ్తార్ విందుల్లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రార్థనలు జరిపారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

» జిల్లాలో ఘనంగా టీడీపీ 42వ ఆవిర్భావ వేడుకలు » ఎన్టీఆర్ చిత్రపటాలకు పార్టీ శ్రేణుల నివాళి » టీడీపీ జెండాల ఆవిష్కరణ



పెద్దాపురం వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



సర్పవరం జంక్షన్: కేకు కట్ చేస్తున్న అనంతలక్ష్మి దంపతులు, ఉదయ్

కాకినాడ సిటీ, మార్చి 29: తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అన్న ఎన్టీఆర్ అని, ప్రతి పేదవాడికి కూడు, గుడ్డ, గూడు అందించాలనే ఆశయంతో పార్టీని స్థాపించి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కొనియాడారు. టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావుతో కలిసి శుక్రవారం కొండబాబు జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి స్వీట్లు పంచారు. వారు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ప్రజలు ఓటర్లుగానే మిగిలిపోకుండా రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని ఉన్నత పదవులను కట్టబెట్టారన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు తెలుగు ప్రజల ఖ్యాతి, అభ్యున్నతి లక్ష్యంగా ప్రజాసేవలో నిమగ్నమైన పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్దమార్కెట్ ఏరియాలో నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాటసారులకు టాటా గ్లూకోజ్ వాటర్ గ్లాసులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కర్రి చిట్టిబాబు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: వలసపాకల మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి నివాసంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, జనసేన,టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్‌తో కలిసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. రమణయ్యపేటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, కరణంగారి సెంటర్‌లో పార్టీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ)ల ఆధ్వర్యంలో టీడీపీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

పెద్దాపురం: పెద్దాపురంలో సుధా కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాజప్ప ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మండలంలోని గుడివాడలో టీడీపీ సీనియర్ నేత చాగంటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచారు. దివిలిలో టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి) ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కాండ్రకోటలో గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నానీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. పెద్దాపురం స్థానిక 10, 12 వార్డులకు సంబంధించిన మామిడి ఈశ్వరరావు, ముత్యాల శ్రీనుతో పలువురు చినరాజప్ప సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, తూతిక రాజు, కొరిపూరి రాజు రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

జగ్గంపేట: జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో వేడుకలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథులుగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయం అంటే అధికారం అనుభవించడం కాదని, ప్రజలకు సేవ చేయడం అంటూ దేశ రాజకీయాలకు సంక్షేమ పాలన నేర్పారన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దాసర్తి సీతారామయ్య, సత్తి సదాశివరెడ్డి, అడబాల భాస్కరరావు, పిలా మహేష్, నండ్ల చిరంజీవి, నేదూరి గణేష్, అరటా పోలీస్, కొండ్రోతు శ్రీను, దేగల సత్తిబాబు, తవటం వీరభద్రరావు, మెరుకుర్తి రాజు, కుంచే తాతాజీ, ముర సత్తిబాబు, వెలిశెట్టి బుజ్జి, ఎండీ కాజా, హరిగోపాల్ పాల్గొన్నారు. రాజపూడి గ్రామ సర్పంచ్ భూసాల విష్ణుమూర్తి అతడి సోదరులు బాబురావు, ఉపసర్పంచ్ పితాని నూకరత్నం, వార్డుమెంబర్లు కర్నాటి వీరబాబు, సర్వసిద్ద రవణ, గనిరెడ్డి సత్తిబాబు, గజ్జల సాయి, భూసాల కొండబాబు తదితర 200 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు.

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెనికి చెందిన పోకల దొరబాబు, ఎస్.తిమ్మాపురం నీటి సంఘం మాజీ ప్రెసిడెట్, సీనియర్ కాంగ్రెస్ నేత ఎడ్ల వెంకట అప్పారావు, వార్డు మెంబర్ బేరి అచ్చిబాబు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, మాజీ ఎంపీటీసీ గోడే దొరబాబు,గంధం ఈశ్వరరావు ఉన్నారు.

తుని రూరల్: తుని కూటమి ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య తేటగుంట పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తల సమక్షంలో సంబరాలు నిర్వహించారు. తుని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మత్స్యకార సంఘ నాయకులు కోడా వెంకటరమణ, తుని పట్టణ టీడీపీ అధ్యక్షులు ఇనుగంటి సత్యనారాయణ, కరప అప్పారావు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగసోమరాజు పాల్గొన్నారు. తుని 8,9వార్డుల్లో అమ్మాజీపేటకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆ పార్టీకి రాజీనామా చేసి తేటగుంట టీడీపీ కార్యాలయంలో దివ్య సమక్షంలో టీడీపీలో చేరారు. చేరినవారిలో చీకట్ల చంద్రశేఖర్, గెడ్డం రవి, గీసాల సతీష్, కొక్కిరి వరప్రసాద్, నక్కా మోహన్, పోలవరపు ప్రసాద్ కుటుంబాలు ఉన్నాయి. టీడీపీ నేత యనమల రాజేష్, మళ్ల గణేష్, నార్ల రత్నాజీ, అల్లు రాజు, కుక్కుదపు బాలాజీ, నెల్లిపూడి బ్రహ్మాజీ తదితరులున్నారు.

పిఠాపురం: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండలశాఖల అధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొండబాబు, చిక్కాల

ప్రత్తిపాడు: పెదశంకర్లపూడిలో ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల నాయకులు కన్నబాబు,సూర్నీడి సురేష్, గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి,మూది నారాయణ స్వామి, ఇళ్ళ అప్పారావు, మిరియాల శ్రీను, చిక్కాల లక్ష్మణరావు, మంతెన శ్రీను, వరుపుల రామకృష్ణ, జ్యోతుల పెదబాబు, సూది ప్రభాకర్ పాల్గొన్నారు.

రౌతులపూడి: మూలగపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మేరకచామవరంలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత జేట్లా రాజా ఆధ్వర్యంలో వైసీపీ మండల మేనేజర్ రాంకూర్తి బాబ్జీ, 30 కుటుంబాలకు ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలున్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, టీడీపీ, జనసేన నేతలు పూలమాలలతో నివాళిలర్పించారు. జనసేన వీర మహిళ ముత్యాల జయలక్ష్మి, బండారు దొరబాబు, టీడీపీ నేతలు కట్టా త్రిమూర్తులు, గర్రే లక్ష్మీనారాయణ, పిల్లి సత్తిబాబు, వాడ్రేవు వీరబాబు, వాతాడి శ్రీను, మల్లాడి సీతారామరాజు, గంజా సూరిబాబు, పినపోతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటనందూరు: కెవిమల్లవరం గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీపెంటకోట భాస్కరసత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, షేక్‌నవాబ్‌జానీ, అంకంరెడ్డి బుల్లిబాబు, చింతకాయల రవికుమార్, వెలగా వెంకటకృష్ణారావు, లగుడు సత్యనారాయణమూర్తి, గొంపదొరబాబు, గెడ్డం కొండయ్యనాయుడు అంకంరెడ్డి వెంకటేష్ తదితరులున్నారు.

శంఖవరం: టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు నెల్లిపూడిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఎగురవేసారు. కార్యక్రమంలో పర్వత సురేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి సుభాష్, బద్ది రమణ, ఉల్లి వీరభద్రరావు, ఓలేటి లక్ష్మీనారాయణ, పాలక ప్రసాద్, పోలం చిన్నా, కర్రి శివగణేష్, కంచిబోయిన శ్రీను, గాబు కృష్ణ, బద్ది రామకృష్ణ పాల్గొన్నారు.









తునిరూరల్: ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న యనమల దివ్య, ప్రత్తిపాడు: పెదశంకర్లపూడిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సత్యప్రభ, తాళ్లరేవులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న బుచ్చిబాబు, కోటనందూరు: కెవిమల్లవరంలో వేడుకలు

రాష్ట్రాభివృద్ధికి టీడీపీని గెలిపించండి : చినరాజప్ప

సామర్లకోట, మార్చి 29: రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల కుటుంబాల్లో సంతోషం కోసం టీడీపీని గెలిపించి అండగా ఉండాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. మండలంలోని పెదబ్రహ్మదేవంలో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై రాజప్ప ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, మండల కమిటీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనుబాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజప్ప కూటమి నాయకులు రాజా సూరిబాబురాజు, విత్తనాల వెంకటరమణ, సరోజా వాసు, మామిడాల రామకృష్ణ, మలకల వెంకట్‌తో కలిసి ప్రచారం చేపట్టారు. అలాగే సామర్లకోటలో రాత్రి విలేకర్లతో రాజప్ప మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలకిచ్చిన హామీలను 85 శాతం తుంగలోకి తొక్కిన రూ.8లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ దోపిడీదారులను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సంసిద్ధులు కావాలని సూచించారు. మద్యనిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న జగన్ ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీ అటుంచితే 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలకు షాక్ కొట్టేలా చేశారన్నారు. 2.30 లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను నిండా మోసం చేశారన్నారు. డీఎస్సీ అని దగా డీఎస్సీగా మార్చారని దుయ్యబట్టారు. ఇసుక విధానాన్ని మారుస్తామని చెప్పి అక్రమంగా దోచుకున్నారని ఆరోపించారు.

'టీడీపీలోకి వస్తే తగిన ప్రాధాన్యమిస్తాం'

ఏలేశ్వరం, మార్చి 29: వైసీపీకి రాజీనామా చేసిన వారు టీడీపీలోకి వస్తే తగిన ప్రాధాన్యత ఇస్తామని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ చలమయ్యలను వారి నివాసంలో టీడీపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యప్రభ మాట్లాడుతూ చలమయ్య వారి బృందాన్ని టీడీపీలోకి ఆహ్వానిస్తున్నామని, తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. వారు మాట్లాడుతూ వైసీపీలో తగిన గౌరవం లేక రాజీనామా చేశామని, టీడీపీలో చేరాలా అవ్వాలా వద్దా అనే విషయాన్ని ఇంకా నిర్ణయించుకోలేదని, తోటి కౌన్సిలర్లు, బంధువర్గంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మండలాధ్యక్షులు సూతి బూరయ్య, కొప్పుల బాబ్జి, కౌన్సిలర్లు బదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోనాల వెంకటరమణ, టీడీపీ నాయకులు షైరాల కనకారావు, సూతి అప్పలరాజు,వరుపుల నెహ్రూ ఉన్నారు.

'కూటమితోనే ప్రజారంజక పాలన సాధ్యం'

తొండంగి, మార్చి 29: రాష్ట్రంలో ప్రజారంజక పాలన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమతుందని తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య అన్నారు. శుక్రవారం తొండంగి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు ఉమ్మడి ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారన్నారు.త్వరలో జరగబోయే ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించి ప్రజలు మెచ్చిన పాలన అందించనుందన్నారు. ప్రతి ఒక్కరూ తనకు అండగి నిలచి విజయం చేకూర్చాలన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దాట్ల బుచ్చిబాబు విజయమే లక్ష్యం'

తాళ్లరేవు, మార్చి 29: జనసేన అధినేత పవన్ ఆదేశాల మేరకు పొత్తులో భాగంగా ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు విజయమే జనసైనికుల లక్ష్యమని కాట్రేనికోన కన్వీనర్ మోకా బాలకృష్ణ, ముమ్మిడివరం కన్వీనర్ దూడల స్వామి, ఐ.పోలవరం కన్వీనర్ మద్దింశెట్టి పురుషోత్తం, తాళ్లరేవు మండల కన్వీనర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శుక్రవారం పి.మల్లవరం ధూళిపూడి గొల్లబాబు కల్యాణమండపంలో తాళ్లరేవు కన్వీనర్ అత్తిలి బాబూరావు అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో వారు మాట్లాడుతూ పితాని బాలకృష్ణ జనసేనకు రాజీనామాచేసి వైసీపీలో కలిసినా, జనసేన కేడరంతా పటిష్టంగా ఉందని బుచ్చిబాబు విజయం కోసం పనిచేస్తుందన్నారు. వీరమహిళలు ముత్యాల జయలక్ష్మి, గిడ్డి రత్నశ్రీ, వెంటపల్లి సత్యవతి, గుద్దేటి జమ్మి, గోదాసి పుండరీషు, గుడాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పుణ్యమంతుల సూరిబాబు, రంబాల రాంబాబు,వేగి నాగభైరవప్రసాద్, విళ్ల వీర,పోసింశెట్టి సూర్యప్రకాష్ ఉన్నారు.

'బీసీల అభ్యున్నతికి పని చేసేది టీడీపీ'

ప్రత్తిపాడు, మార్చి 29: బీసీల అభ్యున్నతి కోసం పని చేసే పార్టీ టీడీపీయే అని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని ఏలూరులో శుక్రవారం నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికి తోడ్పడిన పార్టీ టీడీపీయేనన్నారు. జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీల బీసీ నాయకులంతా క్షేత్రస్థాయిలో రోజూ పర్యటనలు చేయాలని, బీసీలందరూ ఎన్డీయే కూటమిని గెలిపించే విధంగా పని చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ రొంగలి సత్యనారాయణ, టీడీపీ శ్రేణులు కొమ్ముల కన్నబాబు, రొంగలి సూర్యారావు, పల్లా గోపి, మిరియాల శ్రీను, పల్లా గోపి, లొండా లోవరాజు, మదినే దొరబాబు, మాజీ సర్పంచ్ రొంగలి యమున తదితరులు పాల్గొన్నారు.

'ప్రధాని మోదీని గెలిపించాలి'

ప్రత్తిపాడు, మార్చి 29: సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకెళ్తున్న ప్రధాని మోదీని జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. మండలంలోని ఒమ్మంగి గ్రామంలో శుక్రవారం ఇతర పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి బీజేపీ నాయకులు రామ్‌కుమార్, ఉమ్మడి వెంకట్రావు, కర్రి ధర్మరాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏలేశ్వరం మండలం రూరల్ బీజేపీ నాయకులు కూరాకుల రాజా, పోతాబత్తుల పెదబాబు, పలివెల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు అంతం పలకాలి'

తాళ్లరేవు, మార్చి 29: అరాచక వైసీపీ పాలనకు ప్రజలంతా అంతం పలకాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ముమ్మిడివరం అభర్థి దాట్ల బుచ్చిబాబును గెలిపించాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం పటవల పంచాయతీ రామన్నపాలెంలో టీడీపీ, జనసేన నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి ప్రభుత్వం మేనిఫెస్టో పథకాలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో మోకా కస్తూరి, పినపోతు శ్రీను, సంగాడి రాము, మాజీ సర్పంచ్ బీర మాలయ్య మాసగిరి నాగు, నలమాటి వీరబాబు, భజన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో టీడీపీ ప్రచారం

కిర్లంపూడి, మార్చి 29: సింహాద్రిపురంలో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత సర్వారాయుడు ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించారు. సైకిల్‌గుర్తుపై ఓటేసి నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, దొడ్డిపట్ల నాగేంద్రకుమార్, బుజ్జియ్య, జ్యోతుల సత్యమూర్తి, కాకిలేటి రాయుడు, బుజ్జి, జయబాబు, కందా సత్యానందం, అప్పన్న, నంది బాలకృష్ణ, నంది రాజారావు, గొడుగుల కొండబాబు, నాగబాబు, మాదేపల్లి నంది, కాలపురెడ్డి శ్రీను, కుర్ల చినబాబు, గుడాల రాంబాబు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు నాటకం

జగ్గంపేట, మార్చి 29: మండలంలో మల్లిశాల గ్రామ శివారులో ఉన్న సింగరమ్మ అమ్మవారి దేవస్థానం ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వాతంత్ర సమరయోధుడు, అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల రామారావు రచించిన అల్లూరి సీతారామరాజు నాటకం ప్రదర్శించారు. సభకు దేవస్థానం కమిటీ చైర్మన్ తొట్టిపూడి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. నాటక రచయిత పడాల రామారావు తనయుడు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజనసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అల్లూరి పాత్రను తునికి చెందిన గోపు రాంబాబు పోషించారు. నేపథ్య గాయకులు సంగీతం సమకూర్చారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, మార్చి 29: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలనర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలందజేశారు.

25 లీటర్ల సారా స్వాధీనం

కొత్తపల్లి, మార్చి 29: కొత్తపల్లి మండలం శీలంవారిపాకల గ్రామ శివారులో నిర్వహిస్తోన్న నాటు సారా బట్టీపై శుక్రవారం కొత్తపల్లి ఎస్ఐ వీవీసీ.స్వామినాయుడు సిబ్బందితో దాడులు చేశారు. 25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని సారా తయారు చేస్తున్న కోనపాపపేటు చెందిన వాసంశెట్టి మధుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సుమారు 2 వేల లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సామర్లకోట, మార్చి 29: ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల ప్రభావం జిల్లాలో కనిపిస్తోంది. ఈ సీజన్‌లో తొలిసారి శుక్రవారం పలు చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీలపైన నమోదయ్యాయి. సామర్లకోటలో 34, అన్నవరం, తునిలో 33 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే పలు ప్రాంతాల్లో 30 నుంచి 34 డిగ్రీల వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 3రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు

ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవుల గీతాలపనలు

పలుచోట్ల శిలువ యాత్ర ప్రదర్శనలు







జగ్గంపేట చర్చిలో క్రైస్తవులు, సర్పవరంజంక్షన్: పండూరులో శిలువ యాత్ర, శంఖవరం: కత్తిపూడిలో ఊరేగింపు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 29: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మధురానగరలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు బోధనలు తప్పనిసరిగా ఆచరించాలని పాస్టర్ జోసఫ్ బెన్నీ అన్నారు. ప్రతి క్రైస్తవుడు ఇతరులపై దయ, జాలి, కరుణ కలిగి ఉండాలన్నారు. చర్చిస్క్వేర్ సెంటర్‌లోని పురాతనమైన చర్చిల్లో నిర్వహించిన ప్రార్థనల్లో పెద్దసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. కల్వరి టెంపుల్, హౌస్ ఆఫ్ ప్రేయర్, సీఎస్ఐ, పెంతెకోస్తు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జగన్నాథపురం పురవీధుల్లో శిలువ మోస్తున్న క్రీస్తు వేషధారుడిని కొరడాలతో భటులు కొడుతున్నట్టుగా తీసుకెళ్లారు.

సర్పవరం జంక్షన్: పండూరులో జాక్సన్ మినిస్ట్రీస్ పెంతెకోస్తు సంఘం పాస్టర్ కె.రవి జయంత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు.. ఏసుక్రీస్తు రూపం, శిలువను మోసుకుని వెళుతూ శిలువ యాత్ర నిర్వహించారు. నేమాంలో సీయోను ప్రార్థనా మందిరం పాస్టర్ జార్జిబాబు ఆధ్వర్యంలో శిలువ యాత్ర నిర్వహించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గొల్లప్రోలు ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో పవిత్ర శుక్రవారం శిలువ మార్గంలో అంటూ ప్రదర్శన నిర్వహించారు.. క్రీస్తు వేషధారి సిలువ మోస్తుండగా పురవీధుల్లో క్రీస్తు పడిన కష్టాలను వివరిస్తూ ప్రదర్శన జరిపారు. చర్చి వద్ద క్రీస్తును శిలువ వేయడం తదితరాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. చర్చి పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

శంఖవరం: కత్తిపూడి ఆర్‌సీఎమ్ చర్చి సేవకుల ఆధ్వర్యంలో శిలువమార్గం నిర్వహించారు. మానవ లోక పాపపరిహారం కోసం ఏసు శిలువపై తన ప్రాణాలర్పించిన రోజును పురస్కరించుకుని ఈ శిలువమార్గం నిర్వహించామని ఫాదర్ రాజకుమార్ తెలిపారు. శంఖవరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జగ్గంపేట: జగ్గంపేటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్‌లో పాస్టర్ జొన్నకూటి రాజు ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జగ్గంపేట సెయింట్ పాల్స్ లూథరన్ దేవాలయంలో ఫాదర్ రెవరెండ్ జె. రాజు ఏసుక్రీస్తు చేసిన శిలువ త్యాగాన్ని ధ్యానిస్తూ శుభ శుక్రవారం ప్రత్యేకత వివరించారు.

ఏలేశ్వరం: పట్టణంలో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి మిషన్, ఆగ్నీలియం చర్చ్ పాస్టర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణ వీధుల్లో ప్రత్యేక వేషధారణలో ఏసుక్రీస్తు తలపై ముళ్లకరీటం పెట్టి శిలువ మోయించారు. గొల్లలమెట్ట కొండపై శిలువ వేసే ఘట్టాలతో భారీ ప్రదర్శన చేపట్టారు. చర్చిల్లో శిలువపై క్రీస్తు పలికిన మాటలను బైబిల్ ద్వారా పఠనం చేశారు. పేకల జాన్, వి.ఉదయ కుమార్, వాసా అనూష, ఎస్. పల్లవి, శిరోమణి, జ్యోతిరాజు,ప్రశాంత్‌కుమార్,ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

సామర్లకోట: మండలంలోని పనసపాడు పల్లపువీధిలో యెహోవాయీరే ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆత్మీయవిందులో పాల్గొన్నారు. ప్రభుదాస్, యాదిద్య ఛాయా, ఏంజెల్, సంఘస్తులు పాల్గొన్నారు. సామర్లకోటలో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రార్థనలు జరిగాయి. యేసు శిలువ యాత్ర ఆకట్టుకుంది.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో క్రైస్తవ విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తిరుపతిలో క్రీస్టియన్ గాస్పెల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, శ్యామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ సోదరులు ఉపవాస దీక్షలు పాటించారు. ప్రభువును స్తుతిస్తూ ప్రార్థనా గీతాలు ఆలపించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం, రాచపల్లిలోని క్రైస్తవ ప్రార్థనాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మవరం విలీవర్స్ చర్చి పాస్టర్ ఊబా కృపావరం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థాని శ్మశాన వాటికలో ఈస్టర్ సందర్భంగా సమాధులకు రంగులు వేసే కార్యక్రమం చేపట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

గండేపల్లి, మార్చి 29: ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. వివరాలు ప్రకారం.. మండలానికి చెందిన పెండ్ర ప్రసాద్, తన బంధువైన పెండ్ర రవి కలిసి గండేపల్లి మండలం జెడ్‌రాగం,యర్రంపాలెం, పి.నాయకంపల్లి గ్రామాల పరిధిలో రాత్రి వేళ మార్చి మొదటివారంలో సుమారు 12 ట్రాన్స్‌పార్మర్‌లు దొంగిలించి శుక్రవారం మధ్యాహ్నం వాటిని అమ్ముకునేందుకు రాజమండ్రివైపు వెళ్తుండగా వచ్చిన సమాచారం మేరకు ప్రసాద్‌ను అదుపులోకి తీసుకోగా పెండ్ర రవి పరారీలో ఉన్నాడు. నిందితుడి నుంచి కాపర్ వైరు, సుమారు 30లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి పెద్దాపురం రిమాండ్‌కు తరలించాని ఎస్ఐ తెలిపారు.

బంగారు ఆభరణాలు చోరీ

జగ్గంపేట, మార్చి 29: నెహ్రూ కాలనీలో ఓ ఇంట్లో దొంగలు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. అడబాల శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 27న సామర్లకోటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటి పై పోర్షన్ ఉన్న శ్రీను పోర్షన్ తాళాలు పగలుగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే ఆయనకు ఫోన్ చేశారు. ఆయన వచ్చి చూడగా ఇంట్లో బీరులో ఉన్న పది కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్టు గుర్తించారు. జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంజన్లతో సాగునీరు సరఫరా

తాళ్లరేవు, మార్చి 29: పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు వరిచేలకు ఇరిగేషన్ శాఖ అధికారుల సారథ్యంలో నీలపల్లి డ్యామ్ వద్ద ఇంజన్లుతో సాగునీరును పంటకాలువలోకి శుక్రవారం పంపింగ్ చేస్తున్నారు. అలాగే ఓఎన్‌జీసీ పైపులైను వాల్స్‌ను రెండుచోట్ల ఓపెన్‌చేసి సాగునీరు కాలువలోకి పంపింగ్ చేస్తున్నారు. ఆ నీటిని రైతులు ఇంజన్లు ద్వారా చేలకు తోడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇరిగేషన్ ఏఈ ఈశ్వరరావు పర్యవేక్షణలో ఇరిగేషన్ సిబ్బంది సాగునీరు రైతులకు సరఫరా చేస్తున్నారు. శనివారం సాగునీరు వంతు ప్రారంభమవుతుందని, ప్రతీ ఎకరం పూర్తిగా తడిసేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొన్నూరు ఆడపడుచు అవినీతి రూ.7కోట్లు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, మార్చి 29: ఐదేళ్ల ప్రజలకు కనబడని పొన్నూరు ఆడపడుచు ఎన్నికల ముందు పోటీకి పిఠాపురం నియోజకవర్గానికి వచ్చి 30రోజుల్లో రూ.7కోట్లు అవినీతికి పాల్పడిందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పిఠాపురం పురపాలక సంఘంలో 8 పోస్టులను కోటి రూపాయిలకు అమ్ముకున్నారని, మరో 7 పోస్టులు అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో పాత తేదీలు వేసి ఆమోదం కోసం అమరావతికి పంపారని, ఇందులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. అదే విధంగా గొల్లప్రోలు నగరపంచాయతీలో కూడా పోస్టుల భర్తీకి అడ్వాన్సులు తీసుకున్నారని.. ఈ పోస్టులు ఇప్పుడే ఎందుకు భర్తీ చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. పురపాలకసంఘంలో ఉద్యోగాల భర్తీపై ఎన్నికల సంఘానికి, ఆర్వోకు ఫిర్యాదు చేస్తామని విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు వర్మ తెలిపారు. అరబిందో కంపెనీ నుంచి సీఎస్ఆర్ నిధులను అధికంగా తెచ్చి అరకొరగా పనులు చేసి నిధులు స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో 30శాతం కమిషన్ కొట్టేసేందుకు వైసీపీ నేత కుట్ర పన్నారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, పిల్లి చిన్నా, కొరుప్రోలు శ్రీను, అల్లవరపు నగేష్, పంపనబోయిన అన్నపూర్ణ, కోళ్ల బంగారుబాబు, రాయుడు శ్రీను, అందుగుల సత్తిబాబు, వేణుం సురేష్, కేశబోయిన సత్యనారాయణ, అలం దొరబాబు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటా

కొత్తపల్లి, మార్చి 29: తెలుగుదేశం-జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలి, మీ భద్రతకు పూర్తి భరోసా కల్పిస్తా, పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లిలో టీడీపీకి చెందిన బీసీ,ఎస్సీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించగా వర్మ మాట్లాడుతూ మన ఇంటికి-మన వర్మ కార్యక్రమంలో చెప్పిన కార్యక్రమాలన్నీ అమలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అనిశెట్టి సత్యానందరెడ్డి, చెరుకూరి చంటిరాజు, నడింపల్లి సత్యనారాయణరాజు, నడింపల్లి వెంకటేశ్వరరాజు, ఎన్.వరహా సత్యనారాయణరాజు, గొర్ల ఉమాకృష్ణ పాల్గొన్నారు.

స్టేజీ మీదకు పిలవకుండా అవమానిస్తారా?



సమావేశంలో ప్రశ్నిస్తున్న నాయకులు

గొల్లప్రోలు, మార్చి 29: ఫ్లెక్సీల్లో మాత్రమే కౌన్సిలర్లు కనిపిస్తున్నారు, స్టేజి మీదకు పిలవకుండా అవమానిస్తారా అంటూ పలువురు నాయకులు ప్రశ్నించారు. గొల్లప్రోలులోని ప్రవేట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించగా పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ హాజరయ్యారు. వేదికపైకి కౌన్సిలర్లును పిలవకపోవడంతో పట్టణ మాజీ అధ్యక్షుడు దాసం పూసలు, సొసైటీ డైరెక్టరు రామిశెట్టి సత్తిబాబు మాట్లాడుతూ ఫ్లెక్సీల మీద ఫోటోలు తప్ప స్టేజికి మీదకు పిలవరా? కౌన్సిలర్లకు అవమానం జరిగిందని తెలిపారు. 16వ వార్డు ఇన్‌చార్జి చక్కపల్లి దివాణం మాట్లాడుతూ నాయకులంతా కలిసి పనిచేయాలని అంటున్నారు, కాని ఉమ్మడిగా ఒకచోట కార్యాలయం లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. కాగా సమావేశానికి ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది హాజరుకాలేదు. వారి తరఫున భర్తలు హాజరయ్యారు.